TG TEL/25/A1234
www.kakatiyanews.com

# ఉత్తరం కాకతీయ

గురువారం, 08 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 49 | పేజీలు: 4 వెల: 5



## ప్రజాస్వామ్య పరిరక్షణకే కాంగ్రెస్ పోరు

- ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను విభజించే ప్రయత్నం
- 'జీకే గో బ్యాక్' ఉద్యమం ఆగదు
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి
- రాహుల్, ప్రియాంకల అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి
- ఇది కాంగ్రెస్ ఉద్యమం కాదు.. ప్రజల ఉద్యమం
- ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- ఈసీని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆరోపణ

2

## పెట్టుబడులను ఆకర్షించాలి

- అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



2



2

## యాదాద్రి ప్లాంట్ పేరుతో రూ.40 వేల కోట్ల భారం

- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ నిర్మించారా?
- విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరింది
- కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం
- ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

రోడ్డుపైనే పడుకుని నిరసన తెలిపిన ప్రియాంక

మహిళా పోలీసులు గాయపరిచారన్న కాంగ్రెస్ నేత

రాహుల్ సహా పలువురు ఎంపీలు పోలీసుల అదుపులోకి

ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదన్న ఖర్గే

వరుసగా రెండో రోజు ప్రతిపక్షాల ఆందోళన

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు ఇండియా కూటమి డిమాండ్



# ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తత

## జంతర్‌మంతర్ వైపు వెళ్లనివ్వని పోలీసులు

**కాకతీయ,నేషనల్ డెస్క్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఎన్నికల సంఘాన్ని నిలదీసేందుకు కదిలిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో దిల్లీలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. జంతర్‌మంతర్ వైపు ర్యాలీగా వెళ్తున్న ఎంపీలను భద్రతా బలగాలు నిలువరించడంతో నిరసన తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా రోడ్డుపైనే పడుకుని నిరసన తెలిపారు. తనను అక్కడి నుంచి తరలించే ప్రయత్నంలో మహిళా పోలీసులు గోళ్లతో గాయపరిచారని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని కలవడానికి వెళ్తున్న ఎంపీలను అడ్డుకోవడమే కాకుండా ఈ విధంగా వ్యవహరించడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆందోళన మరింత ఉధృతమైంది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని ఇండియా కూటమి ఎంపీలు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘాన్ని కలిసి తమ అభ్యంతరాలను తెలియజేయడంతో పాటు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్‌మంతర్ వైపు ర్యాలీగా బయల్దేరారు. ఎంపీల ర్యాలీ నేపథ్యంలో దిల్లీ పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. జంతర్‌మంతర్‌కు చేరకముందే ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో రహదారిపైనే నిరసన కొనసాగించాల్సి వచ్చింది.

**బస్సులనే నిలిపివేసిన పోలీసులు**

జంతర్‌మంతర్ పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించడంతో పాటు ఎంపీలు ప్రయాణిస్తున్న బస్సులను కూడా నిరసన ప్రదేశానికి కొంత దూరంలోనే నిలిపివేశారు. దీంతో కొందరు కాంగ్రెస్ ఎంపీలు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు. పోలీసులు ముందుకు వెళ్లేందుకు అనుమతించకపోవడంతో ఎంపీలు రహదారిపైనే ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే ప్రియాంక గాంధీ వాద్రా నేలపై

........(తరువాయి 2లో)

## దేశంలో మరో సత్యాగ్రహం మొదలైంది!

**రాహుల్, ప్రియాంకల అరెస్టు ప్రజాస్వామ్యానికి ముప్పు**

- ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఆంక్షలా?
- శాంతియుత నిరసనపై పోలీసుల తీరు హేయం
- రాజ్యాంగ సంస్థల పరిరక్షణకే పోరాటం
- ఆంక్షలతో ప్రశ్నించే గొంతులను అణచలేరు
- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగబద్ధ సంస్థలను పరిరక్షించేందుకు దేశంలో మరో సత్యాగ్రహ పోరాటం మొదలైందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతూ నిరసనకు దిగిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, ఇండియా కూటమి నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. అక్టోబర్ 6న ఎన్నికల సంఘం కార్యాలయం వైపు సాగిన ఇండియా కూటమి నేతల మార్చ్‌ను పోలీసులు అడ్డుకుని పలువురిని అదుపులోకి తీసుకున్న ఘటనను మంత్రి ప్రస్తావించారు. రాజ్యాంగబద్ధ సంస్థల పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ నాయకత్వంలో జరుగుతున్న పోరాటం దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు మరో సత్యాగ్రహంగా మారుతోందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షం లేవనెత్తుతున్న ప్రశ్నలకు సంబంధిత సంస్థలు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆంక్షలతో గొంతు నొక్కలేరు**

దేశ రాజధానిలో నిరసన కార్యక్రమాలపై ఆంక్షలు విధించడం, పోలీసు బలగాలతో నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి అన్నారు. శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం, అనంతరం అదుపులోకి తీసుకోవడం ద్వారా సమస్య పరిష్కారం కాదన్నారు. రాహుల్‌గాంధీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఆంక్షలు, నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోవడం సరికాదని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను కలిసి తమ అభ్యంతరాలు వివరించేందుకు ఇండియా కూటమి నేతలు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఎన్ని నిర్బంధాలు, అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రాజ్యాంగం,

........(తరువాయి 2లో)

## దసరాకు 7 వేల ప్రత్యేక బస్సులు

- రద్దీకి తగ్గట్టుగా ప్రత్యేక సర్వీసులు
- ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో భారీ రద్దీ
- తిరుగు ప్రయాణానికి 25, 26 తేదీల్లో అదనపు ఏర్పాట్లు
- ప్రత్యేక బస్సుల్లో 1.5 రెట్లు సవరించిన చార్జీలు
- రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే
- టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులు నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. కరీంనగర్ జోన్ పరిధిలో 3,533, హైదరాబాద్ జోన్‌లో 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంచనున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రద్దీ లేని మార్గాల నుంచి బస్సులను త్వరితగతిన రద్దీ ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు సంస్థ

........(తరువాయి 2లో)



# టెండర్ గుర్రు




- రూ.10 కోట్ల టెండర్.. ఐదు నెలలుగా ఫైలు పెండింగ్
- టెక్నికల్ లోపాన్ని గుర్తించడంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు ఫెయిల్
- ఈఎన్‌సీ పరిశీలనకు వెళ్లిన ఐదు నెలల తర్వాత అసలు విషయం బహిర్గతం
- టెండర్ పత్రాల పరిశీలనలో అధికారుల తీరుపై పెరుగుతున్న అనుమానాలు
- ఓ రాజకీయ నాయకురాలి జోక్యం ఉందంటూ జీడబ్ల్యూఎంసీలో ప్రచారం
- ఆమె చెప్పినట్లుగానే అధికారిణి ఇంకా నడుచుకుంటున్నట్లుగా చర్చ
- ఫైలు కదలికలపై ఆరా తీయాల్సిందేనంటున్న జనాలు
- చిన్న టెండర్లపైనా దృష్టి సారించాలి.. విజిలెన్స్ విచారణ చేపట్టాలంటూ డిమాండ్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** సుమారు రూ.10 కోట్ల విలువైన రాంపూర్ బయోమైనింగ్ టెండర్ వ్యవహారం జీడబ్ల్యూఎంసీలో టెండర్ల పరిశీలన తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. సాంకేతిక అర్హతలను పరిశీలించిన అధికారులు ఫైలును ఈఎన్‌సీ ఆమోదానికి పంపారు. అక్కడ దాదాపు ఐదు నెలలు ఫైలు పెండింగ్‌లో ఉంది. ఈలోగా పాత ఈఎన్‌సీ బదిలీ అయి.. కొత్త ఈఎన్‌సీ బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వచ్చిన ఈఎన్‌సీ ఫైలు పరిశీలించగా టెండర్ సాంకేతికంగా అర్హత సాధించలేదని గుర్తించి వెనక్కి పంపినట్లు సమాచారం. అగ్రిమెంట్ దశకు వెళ్లకముందే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో అసలు లోపం ఎక్కడ జరిగింది? టెక్నికల్ మూల్యాంకనం చేసిన దశలోనే గుర్తించాల్సిన అంశం ఈఎన్‌సీ పరిశీలనకు ఎలా వెళ్లింది? ఐదు నెలల పాటు ఫైలు పెండింగ్‌లో ఉన్నా విషయం ఎందుకు తేలలేదు? అనే అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. టెండర్‌లో పాల్గొనే సంస్థకు నిర్దేశించిన సాంకేతిక అర్హతలు, అనుభవం, సంబంధిత పత్రాలు, నిబంధనల అమలు వంటి అంశాలను తొలిదశలోనే పరిశీలించాల్సి ఉంటుంది. ఆ పరిశీలన తర్వాతే సాంకేతిక మూల్యాంకనం పూర్తిచేసి తదుపరి ఆమోదానికి ఫైలును పంపాలి. కానీ రాంపూర్

........(తరువాయి 2లో)

## తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే




- ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం
- 30 ఏళ్లుగా డీఈ షాకు హైదరాబాద్‌పై విశ్వాసం
- ఆవిష్కరణలకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం
- 2 వేల మందికి పైగా ఉద్యోగులతో సంస్థ విస్తరణ
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- నియోపొలిస్ కొత్త కార్యాలయానికి మంత్రి స్వాగతం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :**

తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచస్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. యువత ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రపంచ సంస్థలు తమ కార్యకలాపాల నిర్వహణకే పరిమితం కాకుండా కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నిర్వహించిన డీఈ షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డీఈ షా ఒకటని అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. సుమారు 20 మందితో ప్రారంభమైన డీఈ షా ఇండియా

........(తరువాయి 2లో)

# ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

పడుకుని నిరసన వ్యక్తం చేశారు. ఆమెను అక్కడి నుంచి లేపేందుకు పోలీసులు ప్రయత్నించగా ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు ఆమెను ఆందోళన స్థలం నుంచి బలవంతంగా తరలించారు. తనను తరలించే సమయంలో మహిళా పోలీసులు గోళ్లతో గాయపరిచారని ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కలవాలని వెళ్తున్న ఎంపీలను ఈ విధంగా అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. తాను అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేస్తూ, ఎన్నికల సంఘాన్ని కలవడానికి వెళ్లిన ఎంపీలతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. మహిళా పోలీసులు తనను గోళ్లతో గాయపరిచి కిందికి తోసేశారని, పోలీసు బలగాలను వెనక్కి పిలవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమెను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తరలించారు.



**రాహుల్ సహా ఎంపీలను అదుపులోకి**

ప్రియాంక గాంధీతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పలువురు ప్రతిపక్ష ఎంపీలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 2 గంటల పాటు వారిని అదుపులో ఉంచిన అనంతరం విడుదల చేశారు. అంతకుముందు మంగళవారం కూడా రాహుల్, ప్రియాంక గాంధీ సహా పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ రోజు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కొందరు ఎంపీలు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో నిరసన కొనసాగించారు. దాదాపు 9 గంటల పాటు ఆందోళన సాగిన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండా ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర ఎంపీలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసుల వ్యవహారంపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతగా బెదిరించాలని చూసినా తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కేసులు, బెదిరింపులతో తమను భయపెట్టలేరని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు.

**పోలీసుల తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం**

కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలని ప్రయత్నిస్తున్నప్పుడు పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పోలీసుల చర్యలను గూండాయిజంగా అభివర్ణిస్తూ దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని విమర్శించారు. మరో కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం తమ ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 19వ అధికరణం కల్పించిన హక్కులను ప్రస్తావిస్తూ, జంతర్‌మంతర్ నిరసనలకు నిర్ణయించిన ప్రాంతమైనప్పుడు అక్కడికి కూడా ఎంపీలను అనుమతించకపోతే ఎక్కడ ఆందోళన చేయాలని ప్రశ్నించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తమ అభ్యంతరాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ప్రతిపక్ష ఎంపీలు చెబుతున్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ఎన్నికల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో పాటు కేంద్ర ప్రభుత్వంపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్‌కుమార్ ఝూ తెలిపారు.

**వరుసగా రెండో రోజు ఉద్రిక్తత**

ఎన్నికల జాబితా సవరణ అంశంపై ఇండియా కూటమి ఎంపీల ఆందోళన వరుసగా రెండో రోజూ కొనసాగడంతో ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఒకవైపు ఎంపీలను నిరసన ప్రదేశానికి చేరకుండా పోలీసులు అడ్డుకోవడం, మరోవైపు ఎంపీలు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలపడం, పలువురిని అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు కారణమైంది. ఈ వ్యవహారంలో పోలీసులు అనుసరించిన విధానం, ఎంపీలపై నమోదైన కేసులు, ప్రియాంక గాంధీ చేసిన గాయాల ఆరోపణలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ఏ విధంగా స్పందిస్తాయన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై తమ అభ్యంతరాలను వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని ఇండియా కూటమి ఎంపీలు స్పష్టం చేస్తున్నారు. ప్రజల ఓటు హక్కు, ఓటరు జాబితా పారదర్శకత అంశాలను కేంద్రంగా చేసుకుని ఆందోళన కొనసాగిస్తామని చెబుతున్నారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల హక్కుల కోసం పోరాటం ఆగదని మల్లికార్జున ఖర్గే ప్రకటించడంతో ఈ వ్యవహారం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో పాటు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తమ అభ్యంతరాలను పరిష్కరించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి.

# టెండర్ గుర్రు

(మొదటిపేజీ తరువాయి)

బయోమైనింగ్ టెండర్‌లో సాంకేతిక అర్హతకు సంబంధించిన అంశాలపైనే తరువాత అభ్యంతరం వ్యక్తమైనట్లు సమాచారం. అదే నిజమైతే మొదటి దశలో జరిగిన పరిశీలనపై సహజంగానే దృష్టి పడుతోంది. అర్హతకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన అధికారులు ఏం నిర్ధారించారు? ఏ ప్రాతిపదికన సాంకేతిక మూల్యాంకనం పూర్తి చేశారు? ఆ వివరాలు ఫైల్లో ఎలా నమోదయ్యాయి? అన్నది తేలాల్సి ఉంది.

**ఐదు నెలలు ఫైలు కదలలేదెందుకు?**

టెక్నికల్ మూల్యాంకనం పూర్తయిన తర్వాత ఈఎన్‌సీ ఆమోదం కోసం వెళ్లిన ఫైలు దాదాపు ఐదు నెలలపాటు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతకాలం ఫైలు ఏ స్థాయిలో ఉంది? ఎవరి పరిశీలనలో ఉంది? ఎలాంటి అభిప్రాయాలు నమోదయ్యాయి? సాంకేతిక అర్హతకు సంబంధించిన అంశాలపై ఏదైనా అభ్యంతరం అప్పుడే వ్యక్తమైందా? అనే వివరాలు బయటకు రావాల్సి ఉంది. సాంకేతిక అర్హతలో లోపం పత్రాల్లోనే ఉన్నట్లయితే అది ఫైలు ఈఎన్‌సీ వద్దకు వెళ్లకముందే గుర్తించాల్సిన అంశం. గుర్తించకుండా పంపి.. అక్కడ కూడా నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడం టెండర్ పరిశీలన ప్రక్రియపైనే అనుమానాలు రేకెత్తిస్తోంది. ఫైలు పెండింగ్‌లో ఉన్న సమయంలో పాత ఈఎన్‌సీ బదిలీ కాగా.. కొత్త ఈఎన్‌సీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఫైలు పరిశీలనలో టెండర్ సాంకేతికంగా అర్హత సాధించలేదని గుర్తించి వెనక్కి పంపినట్లు సమాచారం. దీంతో గతంలో జరిగిన టెక్నికల్ మూల్యాంకనం ఇప్పుడు కీలకంగా మారింది. ఒక అధికారి పరిశీలనలో ముందుకు వెళ్లిన ఫైలు.. మరో అధికారి పరిశీలనలో సాంకేతిక అర్హత లేదనే దశకు ఎలా చేరిందన్నదే అసలు విషయం. రెండు పరిశీలనల మధ్య తేడా ఏమిటో తేల్చాలంటే టెండర్ పత్రాలు, టెక్నికల్ మూల్యాంకన నివేదిక, నోట్‌ఫైల్, అధికారుల అభిప్రాయాలను పరిశీలించాల్సిందే. రాంపూర్ బయోమైనింగ్ టెండర్‌లో అసలు విషయం తేలాలంటే ఫైలు కదిలిన ప్రతి దశను పరిశీలించాలి. టెక్నికల్ మూల్యాంకనం ఎప్పుడు జరిగింది? ఎవరు చేశారు? ఏ పత్రాలను పరిశీలించారు? ఈఎన్‌సీకి ఫైలు ఎప్పుడు పంపారు? ఐదు నెలల్లో ఏ అధికారుల వద్ద ఉంది? మధ్యలో ఏ నోట్‌లు నమోదయ్యాయి? కొత్త ఈఎన్‌సీ ఏ అంశాన్ని గుర్తించింది? ఏ కారణంతో ఫైలు వెనక్కి వెళ్లింది? అనే వివరాలను ఒకదానితో ఒకటి సరిపోల్చాలి. అప్పుడు మాత్రమే జాప్యానికి కారణం, సాంకేతిక పరిశీలనలో లోపం, బాధ్యత ఎవరిది అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**రాజకీయ జోక్యంపై కార్పొరేషన్‌లో ప్రచారం**

ఇదే సమయంలో టెండర్ వ్యవహారంలో ఓ రాజకీయ నాయకురాలి జోక్యం ఉందంటూ జీడబ్ల్యూఎంసీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఆమె సూచనలకు అనుగుణంగానే ఓ అధికారిణి వ్యవహరిస్తున్నారంటూ కూడా చర్చ జరుగుతోంది. జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఇటీవల జరిగిన ఇతర టెండర్లను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రూ.10 కోట్ల టెండర్‌లో చోటుచేసుకున్న పరిణామాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. టెండర్ పరిశీలన నుంచి ఈఎన్‌సీకి ఫైలు వెళ్లే వరకు, అక్కడ ఐదు నెలలపాటు పెండింగ్‌లో ఉన్న దశ నుంచి కొత్త ఈఎన్‌సీ ఫైలును వెనక్కి పంపే వరకు జరిగిన ప్రతి పరిణామాన్ని రికార్డుల ఆధారంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ జోక్యంపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవమెంతన్నదీ తేల్చాలని కోరుతున్నారు. అవసరమైతే విజిలెన్స్ శాఖతో విచారణ చేయించి బాధ్యతను నిర్ధారించాలని, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని ఇతర టెండర్లలోనూ ఇదే తరహా లోపాలు ఉన్నాయా అన్నది సమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఓటు హక్కును హరించే కుట్ర

**న్యూఢిల్లీ :** దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ దేశ ప్రజలను రెండు వర్గాలుగా విభజించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే.. ఆయనపై చర్యలు తీసుకోవడం దారుణమని పేర్కొన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను అరెస్టు చేసిందని, ఇది ప్రజాస్వామ్యంపై దాడేనని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం కీలక పాత్ర పోషించిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రస్తుతం దేశంలో 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఈ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమం సమయంలో కేంద్ర ప్రభుత్వం తొలుత మొండిగా వ్యవహరించినా.. ప్రజల ఒత్తిడికి తలొగ్గి చివరకు చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఎంత మొండిగా వ్యవహరించినా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని అన్నారు.



**అవసరమైతే ప్రధాని రాజీనామా వరకు పోరాటం**

ఎన్నికల సంఘం వ్యవహారంపై ప్రతిపక్షాల ఆందోళనను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే పోరాటం మరింత విస్తరిస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. పరిస్థితులు మరింత ముదిరితే ప్రధాని రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా వస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓటు హక్కుకు అత్యంత ప్రాధాన్యం ఉందని, దానిని బలహీనపరిచే ఏ ప్రయత్నాన్నీ కాంగ్రెస్ అంగీకరించబోదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఆదాయపు పన్ను శాఖలను ఉపయోగించుకున్నారని ఆరోపించిన ఆయన.. ఇప్పుడు నేరుగా ఎన్నికల సంఘాన్నే రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రజల ఓట్లను తొలగించి తమకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలను మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు నష్టం కలిగేలా ఎలాంటి చర్యలు జరిగినా వాటిని ప్రజల ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

**రాహుల్, ప్రియాంకలపై చర్యలు దారుణం**

రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలపై పోలీసులు వ్యవహరించిన తీరును రేవంత్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ప్రతిపక్ష నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే వారిపై పోలీసులను ప్రయోగించడం సరికాదని అన్నారు. రాహుల్, ప్రియాంకలపై చర్యలు తీసుకోవడం ద్వారా కేంద్రంలోని పాలకుల అసహనం బయటపడుతోందని విమర్శించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, పదవులను కాపాడుకునేందుకు ప్రతిపక్ష నేతలపై పోలీసులను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల హక్కులను కాలరాసిన వారు చరిత్రలో ఎవరూ తప్పించుకోలేదని, చివరకు ప్రజల కోర్టులోనే తీర్పు ఎదుర్కోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయించాలని కోరారు. ప్రజల ఓటు హక్కును కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ ఉద్యమం కాదు.. ప్రజల ఉద్యమం**

రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమైన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని అన్నారు. ప్రజలు ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం తప్పనిసరిగా స్పందించాల్సిందేనని పేర్కొన్నారు. లేదంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగుతారని, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు పోరాటం కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే పోరాటాన్ని మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు.

# దసరాకు 7 వేల ప్రత్యేక బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3,533 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఇందులో ఆదిలాబాద్ రీజియన్ నుంచి 431, నిజామాబాద్ నుంచి 719, కరీంనగర్ నుంచి 1,175, వరంగల్ నుంచి 530, ఖమ్మం నుంచి 678 బస్సులు ఉంటాయి. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 ప్రత్యేక సర్వీసులు నడపనుండగా మహబూబ్‌నగర్ రీజియన్ నుంచి 645, మెదక్ నుంచి 255, నల్గొండ నుంచి 815, రంగారెడ్డి నుంచి 440 బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి మరో 1,312 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించారు.

**రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆయా రోజుల్లో రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందించారు. తిరుగు ప్రయాణ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 25, 26 తేదీల్లో కూడా తగిన ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ నల్లచెరువు, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయినపల్లి, గచ్చిబౌలి తదితర రద్దీ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో పందళ్లు, షామియానాలు, కుర్చీలు, ప్రజా ప్రకటన వ్యవస్థ, తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నారు.

**ఖాళీ బస్సులను రద్దీ మార్గాలకు తరలింపు**

ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక సర్వీసులను నడపడం సంస్థ విధానమని టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. తిరుగు ప్రయాణంలో కొన్ని ప్రత్యేక బస్సుల్లో రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ, రద్దీ అధికంగా ఉన్న మార్గాల్లో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఖాళీగా ఉన్న బస్సులను త్వరితగతిన వెనక్కి తీసుకువచ్చి అవసరమైన రూట్లలో నడపనున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల కేటాయింపులు చేపట్టనున్నారు.

**జీవో ప్రకారం ప్రత్యేక బస్సులకు చార్జీల సవరణ**

పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే ప్రత్యేక బస్సులకు అయ్యే కనీస డీజిల్ వ్యయం, నిర్వహణ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం 2003లో జారీ చేసిన జీవో నంబర్ 16 ద్వారా కల్పించిందని టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. ఈ జీవో ప్రకారం ప్రత్యేక బస్సుల్లో గరిష్ఠంగా 1.5 రెట్ల వరకు టికెట్ ధరలను సవరించుకునే అవకాశం సంస్థకు ఉందని పేర్కొంది. ఉమ్మడి ఆర్టీసీగా ఉన్నప్పటి నుంచి ప్రతి ప్రధాన పండుగకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, టీజీఎస్‌ఆర్టీసీ ఏర్పడిన తర్వాత కూడా కొనసాగిస్తున్నామని తెలిపింది. దసరా సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సులకు కూడా రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 రెట్ల వరకు టికెట్ చార్జీలను సవరించినట్లు స్పష్టం చేసింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రత్యేక బస్సులకు మాత్రమే ఈ సవరించిన చార్జీలు వర్తిస్తాయని పేర్కొంది. ఈ నెల 9, 10, 16, 17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ అధికంగా ఉండే 25, 26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయని తెలిపింది. ప్రత్యేక బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే కొనసాగుతాయని స్పష్టం చేసింది.

**మహిళలకు ఉచిత ప్రయాణం యథావిధి**

రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరా సందర్భంగా నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్, ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా కొనసాగుతుందని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి స్పష్టం చేశారు. పండుగ ప్రయాణాల్లో మహిళలకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. దసరా సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని యాజమాన్యం సూచించింది. సంస్థ వెబ్‌సైట్‌లో ముందస్తు టికెట్ బుకింగ్



సదుపాయం అందుబాటులో ఉందని తెలిపింది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం, ప్రయాణ వివరాల కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040 69440000, 04023450033ను సంప్రదించాలని సూచించింది. పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని సంస్థ కోరింది.

# తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్థానం ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2 వేల మందికి పైగా ఉద్యోగులతో విస్తరించిందని తెలిపారు. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయని వివరించారు.

**హైదరాబాద్ ఎదుగుదలతో సంస్థ వృద్ధి**

మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో గణనీయంగా మారిందని, సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగిందని చెప్పారు. యువతలోని నైపుణ్యం, ప్రతిభే తెలంగాణకు ప్రధాన బలమన్నారు. ప్రపంచ సంస్థలు రాష్ట్రంలో విస్తరించాలని, ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని, అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలని ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. నియోపొలిస్‌లో డీఈ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. ఇది కేవలం మరో కార్యాలయం కాదని, హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి బలమైన సంకేతమని అన్నారు. కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

**విస్తరణకు ప్రభుత్వం పూర్తి సహకారం**

ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. డీఈ షా నాయకత్వానికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీఈ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్‌జ్‌లను మంత్రి అభినందించారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌పై సంస్థ మూడు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న విశ్వాసం, తాజాగా నియోపొలిస్‌లో చేపడుతున్న విస్తరణ తెలంగాణలో ప్రపంచస్థాయి సంస్థలకు ఉన్న అవకాశాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

# దేశంలో మరో సత్యాగ్రహం మొదలైంది!

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగబద్ధ సంస్థల పరిరక్షణ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో పాటు ఎన్నికల జాబితా సవరణపై ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతుందని తెలిపారు.

# యాదాద్రి ప్లాంట్ పేరుతో రూ.40 వేల కోట్ల భారం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు లేకుండానే యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం ద్వారా రాష్ట్ర ప్రజలపై రూ.40 వేల కోట్ల భారం మోపారని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దీనికి ఎవరు బాధ్యత వహించాలనే ప్రశ్నకు మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు అందుబాటులో లేదని, సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా కోసం ఒప్పందాలు చేసుకున్నా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్ నిర్మించారా లేదా అనేది హరీశ్‌రావు స్పష్టం చేయాలని కోరారు.

**3 యూనిట్లను ప్రారంభించాం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బొగ్గు సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేసి 3 యూనిట్లను ప్రారంభించామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినా ఎలాంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదని భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ అంశంపై ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. విద్యుత్ సరఫరా, బొగ్గు సరఫరా విషయంలో తమ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తూ విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. Yడాద్రి ప్లాంట్ బొగ్గు సరఫరాపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని సవాల్ చేశారు.

# పెట్టుబడులను ఆకర్షించాలి

- అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**కాకతీయ, హైదరాబాద్ :** రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సమావేశానికి సంజయ్ జాజు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించే అంశాలపై సమీక్షించారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ సూచించారు. పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ అండ్ ఈసీ సంయుక్త కార్యదర్శి అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో, ఎండీ అజిత్‌రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.






# లాడ్జీలు, హోటళ్లలో నిబంధనలు పాటించాలి

- అతిథుల వివరాలు నమోదు చేయాలి
- హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్

**కాకతీయ, హన్మకొండ :** లాడ్జీలు, హోటళ్ల యజమానులు, నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్ల యజమానులు, నిర్వాహకులతో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి అతిథి వివరాలను గెస్ట్ రిజిస్టర్‌లో నమోదు చేసి, గుర్తింపు పత్రాలను పరిశీలించిన తర్వాతే గదులు కేటాయించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అనుమానాస్పద వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీసుల తనిఖీల సమయంలో రిజిస్టర్లు, సీసీటీవీ ఫుటేజ్, ఇతర రికార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సతీష్, కిషోర్ పాల్గొన్నారు.

# 9న నిరుద్యోగులకు ఉద్యోగాల పండుగ

- పలు కంపెనీల్లో కొలువులకు అవకాశం
- 15 కౌంటర్లు.. ఉచిత రవాణా, భోజన సౌకర్యాలు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**కాకతీయ, భూపాలపల్లి :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 9న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గార్డెన్స్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. వివిధ విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం పుష్ప గ్రాండ్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో జాబ్‌మేళా ఏర్పాట్లపై సమీక్షించారు. టెంట్లు, సౌండ్ సిస్టమ్, భోజనం, రవాణా, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, వసతి తదితర ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో నిర్వహించే మేళాలో పలు కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. అభ్యర్థుల కోసం 15 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 8 మండలాలకు 8, భూపాలపల్లి పట్టణానికి ఒకటి, 4-5 జనరల్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**గ్రామీణ యువతకు ఉచిత రవాణా**

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం ఆటోలు, టాటా ఏస్ వాహనాలను ఉచితంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సర్పంచులు, ఎంపీడీఓలు సమన్వయంతో ఉదయాన్నే టిఫిన్ అందించి అభ్యర్థులను మేళా ప్రాంగణానికి తరలించాలని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, డీఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన వారు హాజరు కావచ్చన్నారు. ధ్రువపత్రాలతో ఉదయం 7 గంటలకు పుష్ప గార్డెన్స్‌కు చేరుకోవాలని సూచించారు. గతంలో నిర్వహించిన జాబ్‌మేళాలో సుమారు 2770 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయని రాహుల్ శర్మ తెలిపారు. ఈసారి మరింత విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నందున పెద్ద సంఖ్యలో యువత వచ్చే అవకాశం ఉందన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జెన్‌కో సీఈ శ్రీ ప్రకాష్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

- 13నుంచి సమ్మెకు దిగుతున్న ఉద్యోగులకు అండగా ఉంటాం
- జీతాలు పెంచి ఇన్‌క్రిమెంట్లు ఇవ్వాలి
- హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలి
- కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి
- 17 వేల మంది సేవలను ప్రభుత్వం గుర్తించాలి
- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఈ నెల 13 నుంచి ఉద్యోగులు చేపట్టనున్న సమ్మెకు బీఆర్ఎస్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు జీతాలు పెంచి తగిన ఇన్‌క్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎంలో సుమారు 17 వేల మంది ఉద్యోగులు వివిధ విభాగాల్లో పనిచేస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని వినోద్‌కుమార్ తెలిపారు. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది ప్రజారోగ్య వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్నారని అన్నారు.

**ఇన్సూరెన్స్‌తో కుటుంబాలకు భరోసా**

ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు వెంటనే కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగినా, అనారోగ్యానికి గురైనా, ఉద్యోగి మరణించినా వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఎన్‌హెచ్‌ఎంలో ఇతర రాష్ట్రాల్లో తీసుకున్న నిర్ణయాలను తెలంగాణ ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ఉద్యోగుల ప్రతినిధులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రెసిడెంట్ డా. మహేందర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. భరత్, జనరల్ సెక్రటరీ ఎండీ రుకముద్దీన్, కార్యవర్గ సభ్యులు నరేష్, వినోద్ తదితరులు వినతిపత్రం అందజేశారు.



# రాహుల్ అరెస్ట్ నియంతృత్వానికి పరాకాష్ట

- ఓట్ల జాబితా అవకతవకలపై ప్రశ్నిస్తే అరెస్టులా?
- ఇండియా కూటమి నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ హనుమకొండలో భారీ ధర్నా
- అమిత్ షా దిష్టిబొమ్మ దహనం




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** దేశంలో ఓట్ల తొలగింపు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో జరిగిన అవకతవకలను ప్రశ్నిస్తే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విధానాలకు గొడ్డలిపెట్టులాంటిదని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా ఎన్నికల సంఘం ముందు నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఇండియా కూటమి నేతలను పోలీసులు అడ్డుకోవడం దారుణమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు నియంతృత్వ పాలనకు పరాకాష్ట అని విమర్శించారు. హనుమకొండ డీసీసీ కార్యాలయం చౌరస్తాలో బుధవారం ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.

**ఓట్ల జాబితాపై ప్రశ్నిస్తే అరెస్టులా**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీలు నిరసన ర్యాలీ చేపట్టారని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. ఈ నిరసనపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో అడ్డంకులు సృష్టించిందని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలో ఒక ముఖ్యమైన సమస్యపై ఇండియా కూటమి నాయకులు పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం నియంతృత్వ పాలనకు పరాకాష్ట అని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం ముందు శాంతియుతంగా దీక్ష చేసేందుకు వెళ్తున్న నేతలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్, ఇండియా కూటమి అగ్రనేతలు పాల్గొన్న నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు దుర్మార్గమని, ప్రతి ప్రజాస్వామ్యవాది దీనిని ఖండించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని, దాని ద్వారా బీజేపీ అక్రమంగా అధికారంలోకి వస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో జరుగుతున్న పరిణామాలపై ప్రశ్నిస్తున్న ఇండియా కూటమి నేతలను అడ్డుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**కేంద్ర ప్రభుత్వ తీరుపై నినాదాలు**

హనుమకొండ డీసీసీ కార్యాలయం చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓటర్ల జాబితా, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు సమాధానం చెప్పాలని, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కార్పొరేషన్ల జిల్లా చైర్మన్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఆర్‌జీపీఆర్ఎస్ ప్రతినిధులు, మండల, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు కూడా నిరసనలో పాల్గొన్నారు.

# హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆలయాలకు భారీగా నిధులు

- కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయానికి రూ.3.80 కోట్లు
- పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయానికి రూ.1.50 కోట్లు
- రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.85 లక్షలు
- రాజగోపురాలు, ప్రాకార మండపాలు, భవనాల నిర్మాణానికి నిధులు
- ఎఫ్‌డీఆర్‌ల నుంచి నిధుల వినియోగానికి దేవాదాయ శాఖ అనుమతి
- మంత్రి పొన్నం ప్రభాకర్



**రేణుక ఎల్లమ్మ ఆలయానికి రూ.85 లక్షలు**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధి పనులకు రూ.85 లక్షల వరకు నిధులు ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఇందులో పట్నాల మండపం నిర్మాణానికి రూ.40 లక్షలు, బోనాల మండపానికి రూ.40 లక్షలు, ప్రసాదం తయారీ సముదాయానికి రూ.5 లక్షలు కేటాయించారు. ఆమోదించిన ప్రణాళికలు, అంచనాలు, దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగానే నిధులను వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పనులకు వాస్తవంగా అవసరమైన మేరకు మాత్రమే స్థిర డిపాజిట్ల నుంచి నిధులు ఉపసంహరించుకోవాలని, మిగిలిన మొత్తాన్ని డిపాజిట్లలోనే కొనసాగించాలని ఆదేశించింది. నిధుల ఉపసంహరణ, స్థిర డిపాజిట్ల వివరాలు, ఖర్చు చేసిన మొత్తంపై పూర్తి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ప్రముఖ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో భక్తులు, ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దేవాదాయ శాఖ పరిపాలనా అనుమతులు జారీ చేసిందన్నారు. కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి రూ.3.80 కోట్లు, పొట్లపల్లి శ్రీ స్వయంభు రాజేశ్వరస్వామి ఆలయానికి రూ.1.50 కోట్లు, హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి రూ.85 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.3,80,33,750 పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ నిధులతో ఐదు అంతస్తుల రాజగోపురం, ప్రాకార మండపం, బౌండరీ వాల్, దక్షిణ, పశ్చిమ వైపులా మూడు అంతస్తుల రాజగోపురాలు, కార్యాలయ భవనం, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

**రాజగోపురాలు, కార్యాలయ భవనానికి నిధులు**

కొత్తకొండ ఆలయంలో ఐదు అంతస్తుల రాజగోపురానికి రూ.65 లక్షలు, ప్రాకార మండపం, బౌండరీ వాల్‌కు రూ.1.06 కోట్లు, దక్షిణ వైపు మూడు అంతస్తుల రాజగోపురానికి రూ.35 లక్షలు, పశ్చిమ వైపు రాజగోపురానికి రూ.35 లక్షలు కేటాయించారు. కార్యాలయ భవనానికి రూ.1.04 కోట్లు, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయానికి రూ.17 లక్షలు, శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి రూ.17 లక్షలు వెచ్చించనున్నారు. పనుల అమలుకు దేవస్థానం వద్ద ఉన్న 9 స్థిర డిపాజిట్ల నుంచి గరిష్ఠంగా రూ.3,85,29,060 వరకు ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని శ్రీ స్వయంభు రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్ల నిధుల వినియోగానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఐదు అంతస్తుల రాజగోపురం నిర్మాణంలో మిగిలిన పనులకు రూ.50 లక్షలు, ఆలయం చుట్టూ ప్రాకార మండపం నిర్మాణానికి రూ.1 కోటి ఖర్చు చేయనున్నారు. ఆలయం వద్ద ఉన్న 5 స్థిర డిపాజిట్ల నుంచి అవసరమైన మేరకు గరిష్ఠంగా రూ.1.50 కోట్లను ఉపసంహరించుకుని ఆమోదించిన పనులకు వినియోగించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

# సైబర్ మోసాలకు అప్రమత్తతే రక్షణ

- సాంకేతికత పెరిగే కొద్దీ కొత్త పద్ధతుల్లో మోసాలు
- నకిలీ ఇన్‌వాయిస్‌లు, ఉద్యోగ ఆఫర్లతో జాగ్రత్త
- లోన్ యాప్‌లు, నకిలీ కాల్స్‌ను నమ్మొద్దు
- అనుమానాస్పద లింకులతో అప్రమత్తంగా ఉండాలి
- మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కాకతీయ, కరీంనగర్ :** సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, వాటి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆస్త్రా కన్వెన్షన్‌లో బుధవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సౌజన్యంతో రూపొందించిన 'పాజ్ ఫర్ సేఫ్టీ' అవగాహన పోస్టర్‌ను గౌష్ ఆలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేసే పలు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. నకిలీ ఇన్‌వాయిస్‌లు, నకిలీ కొనుగోలు ఆర్డర్లతో వ్యాపారులను మోసం చేసే ముఠాలు ఉన్నాయని సీపీ తెలిపారు. చెల్లింపులు చేసే ముందు విక్రేత వివరాలు, బ్యాంకు ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఇంటి నుంచే పని చేస్తూ తక్కువ శ్రమతో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చంటూ వచ్చే పార్ట్‌టైమ్ ఉద్యోగాల ఆఫర్లను నమ్మవద్దన్నారు. అసలైన సంస్థలు ముందస్తుగా రిజిస్ట్రేషన్ రుసుములు వసూలు చేయవని స్పష్టం చేశారు.

**లోన్ యాప్‌లు, నకిలీ కాల్స్‌తో మోసం**

తక్షణ రుణాలు ఇస్తామంటూ వచ్చే మోసపూరిత యాప్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, పరిచయాల వివరాలను సేకరించి వేధింపులకు గురిచేసే ప్రమాదం ఉందని గౌష్ ఆలం హెచ్చరించారు. గుర్తుతెలియని రుణ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దన్నారు. బ్యాంకు అధికారులు, పోలీసులమని బెదిరిస్తూ వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను తెలియని వ్యక్తులకు ఇవ్వవద్దని సూచించారు.

**భారీ డిస్కౌంట్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు**

సామాజిక మాధ్యమాల్లో భారీ డిస్కౌంట్ల పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్ల లింకులను నమ్మి ముందుగానే నగదు చెల్లించవద్దని సీపీ సూచించారు. ఆన్‌లైన్ కొనుగోళ్ల సమయంలో వెబ్‌సైట్ విశ్వసనీయతను పరిశీలించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్‌లో జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా అధికారిక సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గౌష్ ఆలం కోరారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు, సైబర్ విభాగం ఎస్సైలు అనూష, సిబ్బంది, ఎస్ఆర్ జూనియర్ ప్రైవేట్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- రూరల్ ఏసీపీ విజయకుమార్




**కొత్తపల్లి/కరీంనగర్ :** కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, మల్కాపూర్ గ్రామాల్లో పోలీసులు బుధవారం సాయంత్రం విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. రూరల్ ఏసీపీ విజయకుమార్ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పోలీసులు గ్రామాల్లోని ప్రతి వీధిలో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను ఆరా తీయడంతోపాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయకుమార్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసమే ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు, మోసపూరిత లింకులు, ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు కాలనీలు, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్సైలు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం, మల్కాపూర్‌లో కార్డన్ అండ్ సెర్చ్

- నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం
- అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- రూరల్ ఏసీపీ విజయకుమార్



**కాకతీయ, కరీంనగర్ :** కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, మల్కాపూర్ గ్రామాల్లో పోలీసులు బుధవారం సాయంత్రం విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. రూరల్ ఏసీపీ విజయకుమార్ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పోలీసులు గ్రామాల్లోని ప్రతి వీధిలో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను ఆరా తీయడంతోపాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయకుమార్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసమే ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు, మోసపూరిత లింకులు, ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు కాలనీలు, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్సైలు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల కార్యవర్గం ఎన్నిక

**సంఘం అధ్యక్షుడిగా ఇర్ల రవి, ప్రధాన కార్యదర్శిగా కె. ముఖేష్**

**కాకతీయ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల సెంట్రల్ కమిటీ ఎన్నికలు బుధవారం హైదరాబాద్‌లోని ఆబ్కారీ భవన్ సమావేశ మందిరంలో జరిగాయి. ఎన్నికైన కమిటీ సభ్యులు తమ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సంఘం అధ్యక్షుడిగా ఇర్ల రవి, ప్రధాన కార్యదర్శిగా కె. ముఖేష్, కోశాధికారిగా డి. వీరస్వామి, సంయుక్త కార్యదర్శిగా డి. స్వరూప, ప్రచార విభాగం కార్యదర్శిగా బి. మేరీలు ఎన్నికయ్యారు. వీరితోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కార్యవర్గాల ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. నూతన కార్యవర్గ సభ్యులు సంఘాన్ని బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.



## తొమ్మిదేళ్లుగా దుర్గామాత ప్రతిష్ఠ

- ఈ నెల 10న అమ్మవారి ఆగమనం
- దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



**కాకతీయ, గీసుకొండ :** గీసుగొండ మండలం ఎలుకుర్తి హవేలీ గ్రామంలోని గొల్లపల్లె యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని ప్రముఖులను నిర్వాహకులు ఆహ్వానించారు. గ్రామంలో దుర్గామాతను ప్రతిష్ఠించి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న దుర్గామాత ఆగమన కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు, రాంపూర్ సర్పంచ్ రడం భరత్ కుమార్, ఎలుకుర్తి హవేలీ సర్పంచ్ జన్ను దివ్యభారతి,గీసుగొండ సీఐ విశ్వేశ్వర్‌కు యూత్ సభ్యులు ఆహ్వానాలు అందజేశారు. అనంతరం వారిని యూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని, దుర్గామాత కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని యూత్ సభ్యులు ఆకాంక్షించారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు



**కాకతీయ, ఇనుగుర్తి :** రైతులు విద్యుత్ సమస్యల పట్ల ఇబ్బంది పడకుండా ఉండాలని నూతన ట్రాన్స్ఫార్మర్ను మంజూరు చేసినట్లు సర్పంచ్ రాయలి భవాని శేఖర్ తెలిపారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇనుగుర్తి మండలం లోని చిన్నముప్పారం గ్రామ రైతులు విద్యుత్ సమస్యల తీవ్రంగా ఎదుర్కొంటున్నారని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర దృష్టికి తీసుకువెళ్ళగా వెంటనే స్పందించి నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను మంజూరు చేశారని వారికి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయిలి భవానిశేఖర్, పిఎసిఎస్ చైర్మన్ గుండా వెంకన్న, కొత్తపెల్లి రమేష్, కాలేరు చంద్రశేఖర్, అలువాల మల్లయ్య, నేరెళ్ల కృష్ణ, గుండ్ల యాకన్న, మల్లం మురళి, గుండా దేవేందర్, కొత్తపల్లి నరేష్, రడం ముత్తయ్య, కొండ ముత్తయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

## కల్తీ అల్లం.. వెల్లుల్లి పేస్ట్ గుట్టురట్టు

- ఏనుమాములలో టాస్క్‌ఫోర్స్ దాడి
- అనుమతులు లేకుండానే తయారీ
- అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం ముడిసరుకులతో కల్తీ
- రూ.13,605 విలువైన సరుకు స్వాధీనం.. ఒకరి అరెస్ట్



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరేపల్లిలో కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో హెచ్‌కేజీఎన్ ఇండస్ట్రీస్‌లో తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో పేస్ట్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. నాసిరకం ముడిసరుకులు, అల్లం పొడిని పేస్ట్‌లో కలిపి వివిధ బ్రాండ్ల పేర్లతో ప్యాకింగ్ చేసి దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 60 కిలోల లూజ్ పేస్ట్, 500 గ్రాములు, 1 కిలో బాక్సులు, ఎక్స్‌పైరీ అయిన రీఫిల్లింగ్ వస్తువులు, ఫుడ్ కలర్, సిట్రిక్ యాసిడ్ తదితరాలు కలిపి రూ.13,605 విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఆరేపల్లికి చెందిన మహమ్మద్ సలీం పాషాను అదుపులోకి తీసుకుని, సరుకుతో సహా తదుపరి చర్యల కోసం వరంగల్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఏసీపీ ఎ. మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ బి. రాజగోపాల్, ఎస్ఐ కె. శ్యాంసుందర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## 600 కేజీల చక్కెర పట్టివేత



**కాకతీయ, పెద్దవంగర :** నాటుసారా తయారీకి వినియోగించే 600 కేజీల చక్కెరను సరఫరా చేస్తున్న వ్యక్తిని పెద్దవంగర మండల పోలీస్ లు పట్టుకొని అరెస్ట్ చేశారు.ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మొన్న తొర్రూర్ మండలంలోని అమర్సింగ్ తండకు చెందిన ఇద్దరు యువకులు పెద్దవంగర మండలంలో 15లీటర్ల గుడుంబను సరపర చేస్తుండగా పట్టుకొని నాటుసారకు ఉపయోగించే బెల్లం ఎక్కడి నుండి తెస్తున్నారని అడగక బెల్లం కాదు చక్కెర అని చెప్పడంతో ఆ షాప్ వివరాలు తెలుసుకోని తొర్రూర్ మండలంలోని శ్రీమాత ట్రేడర్స్ షాప్ ను తనిఖీ చేసి 12 బస్తాలు చక్కరను పట్టుకున్నారు. అనంతరం షాప్ నడుపుతున్న శ్రీధర్ ను అరెస్ట్ చేశామని తెలిపారు.

## బస్సు చక్రాల కింద పడి విద్యార్థి దుర్మరణం



**కాకతీయ, నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పిట్టకాలుబోడు తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యోదయ హైస్కూల్‌కు చెందిన పాఠశాల బస్సు కింద పడి ఓ విద్యార్థి మృతిచెందాడు. బస్సు చక్రాలు విద్యార్థిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యార్థి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఈటలను కలిసిన బీజేపీ మండల నాయకులు

**కాకతీయ, నెల్లికుదురు :** భారతీయ జనతా పార్టీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను నెల్లికుదురు బీజేపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల నాయకుడు తోట రమేష్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్‌తో భేటీ అయి పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తోట రమేష్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆకుల లింగయ్య, బూత్ అధ్యక్షుడు తోట సురేష్, దాసరి శేఖర్, ఏర్పుల మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సుందరగిరి గడ్డపై జానపద జాతర!

- సందడిగా కనకవ్వ బతుకమ్మ పాట 2026 చిత్రీకరణ





**కాకతీయ, చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం బుధవారం పండుగ శోభతో పరవశించింది. ప్రముఖ తెలంగాణ జానపద గాయని కనకవ్వ గ్రామానికి రావడంతో సందడి నెలకొంది. శ్రీ ఫిల్మ్ మ్యూజిక్ ప్రెజెంటేషన్‌లో రూపొందుతున్న 'బతుకమ్మ 2026' ప్రత్యేక జానపద గీతం వీడియోను గ్రామంలోని ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో చిత్రీకరించారు. పాటలో కనకవ్వకు తోడుగా 'జబర్దస్త్' ఫేమ్ నటి యోధ నటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సాగిన చిత్రీకరణలో గ్రామ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడారు. కళాకారులకు సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి, గ్రామస్థుల తరఫున ఘన స్వాగతం పలికారు. షూటింగ్‌కు పంచాయతీ తరఫున ఏర్పాట్లు చేశారు. కనకవ్వను, చిత్రీకరణను తిలకించేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు. పాటను బాషం పోచవ్వ, ఎ. నాగేశ్వరమ్మ నిర్మించగా, ఎ. అశోక్ సహ నిర్మాతగా వ్యవహరించారు. అరుణ్ కొలుగూరి దర్శకత్వం, ఛాయాగ్రహణం, కూర్పు బాధ్యతలు చేపట్టారు. పాలోజీ గంగాచారి సాహిత్యం, వెంకట్ అజ్మీర్ సంగీతం, సన్ని గణేష్ నృత్య దర్శకత్వం వహించారు. అంజి, చిరంజీవి, రవి నటించారు. కార్యక్రమంలో జంగ రమణారెడ్డి, మేడబోయిన రాజు, చికోటి రమణయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆవుల శ్రీనివాస్, బొల్లబత్తిని మహేష్, బరిగెల మహేందర్, రెడ్డి శ్రీనివాస్, నల్లగొని సురేష్, ఎనగందుల లత, తాళ్లపల్లి వసంత తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెల కూల్చివేతపై ఉద్రిక్తత

- చెరబండరాజు కాలనీలో పేదల ఇళ్ల తొలగింపు
- పోలీసులతో కాలనీవాసుల వాగ్వాదం
- బాధితులకు సంఘీభావానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వినయ్ అరెస్ట్






**కాకతీయ, వరంగల్ బ్యూరో :** భద్రకాళి ఆలయ సమీపంలోని చెరబండరాజు కాలనీలో గుడిసెల కూల్చివేత ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం తెల్లవారుజామున కుడా అధికారులు, మట్టెవాడ పోలీసులు భారీగా చేరుకుని గుడిసెల తొలగింపు చర్యలు చేపట్టడంతో కాలనీవాసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించకుండా ఇళ్లు తొలగించడం ఏమిటంటూ మహిళలు, బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. గతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, వాటిని అమలు చేయకుండానే గుడిసెలు కూల్చుతున్నారని ఆరోపించారు. కొందరు బాధితులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నట్లు సమాచారం. తమ ఇళ్లు కూల్చి తమనే అరెస్ట్ చేశారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బాధితులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేసినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. అనంతరం సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చే రాజ్యమా?' అని ప్రశ్నించారు. ఆలయ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అదే సమయంలో పేదలకు పునరావాసం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఏనుమాముల మార్కెట్‌కు భద్రత కట్టుదిట్టం

- కమాండ్ కంట్రోల్‌కు 120 సీసీ కెమెరాల అనుసంధానం
- రైతుల సరుకులు, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు
- మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు మార్కెట్ కమిటీ కీలక చర్యలు చేపట్టిందని మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక తెలిపారు. గత 10 సంవత్సరాల్లో జరిగిన అవాంఛనీయ ఘటనలను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళ రైతుల సరుకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అసాంఘిక వ్యక్తులు, రవాణా వాహనాల ప్రవేశాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్‌లో దొంగతనాలను అరికట్టడంతోపాటు తెల్లవారుజామున వ్యాపారాలకు వచ్చే మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సూచన మేరకు ఏనుమాముల, కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన 120 సీసీ కెమెరాలను వరంగల్ కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. దీంతో మార్కెట్ పరిధిలో నిఘా మరింత పెరిగి నేరాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని పులి ప్రియాంక ఆశాభావం వ్యక్తం చేశారు.

## అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి : సీడీపీవో శిరీష




**కాకతీయ, ఇనుగుర్తి :** తల్లి, బిడ్డల క్షేమం కోసం అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో శిరీష అన్నారు. బుధవారం ఇనుగుర్తి రైతు వేదికలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషణ మాసంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు నెలనెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. సఖి సెంటర్ ప్రతినిధి శ్రావణి మాట్లాడుతూ మహిళలు తమకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సఖి సెంటర్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ ఆడ, మగ పిల్లల మధ్య తేడా చూపకుండా పెంచాలని, జిల్లాలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉందని తెలిపారు. పిల్లలను అక్రమంగా దత్తత తీసుకోవడం నేరమని, అలాంటి వారికి జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో కమలాదేవి, సూపర్‌వైజర్ దుర్గ, దిశా కమిటీ సభ్యుడు బాబురావు, మెడికల్ ఆఫీసర్ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ సుదర్శన్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో మట్టి బహిరంగ వేలం



**కాకతీయ, శంకరపట్నం :** మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సుమారు 18 ట్రాక్టర్ ట్రిప్పుల మట్టిని బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తహసీల్దార్ కే. సురేఖ తెలిపారు. హుజూరాబాద్ అదనపు న్యాయమూర్తి ఆదేశాల మేరకు మట్టిని వేలం వేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అక్టోబర్ 8న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు నిర్ణీత సమయానికి కార్యాలయానికి హాజరై వేలం ప్రక్రియలో పాల్గొనాలని తహసీల్దార్ కే. సురేఖ సూచించారు.

## బతుకమ్మ వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు చేయండి

- డబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** అక్టోబర్ 10 నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 66 డివిజన్లలో బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. ఈ నెల 18న సద్దుల బతుకమ్మ, 20న దసరా వేడుకలు జరిగే పద్మాక్షి, భద్రకాళి, వేయి స్తంభాల గుడి, గుండుచెరువు, బంధం చెరువు, పెద్దచెరువు, హసన్‌పర్తి, ఉర్సుగుట్ట, రంగసాయిపేట, శివనగర్, తోటమైదాన్, చిన్నవడ్డేపల్లి, కాశిబుగ్గ తదితర ప్రాంతాల్లో రద్దీకి అనుగుణంగా సదుపాయాలు కల్పించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి ఫాగింగ్, శానిటేషన్ స్ప్రేయింగ్, అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో పూలు, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వీధి దీపాల మరమ్మతులు, హైమాస్ట్ లైట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు, పార్కింగ్ వసతులు కల్పించాలని సూచించారు. గుర్రపు డెక్కను తొలగించి ప్రధాన ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎస్ఎఫ్‌వో రాజేశ్వరరావు, ఈఈలు రవికుమార్, సంజయ్‌కుమార్, మహేందర్, ఎంటమాలజిస్ట్ రజని తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ అరెస్టు నిరంకుశానికి నిదర్శనం

- ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణకు అఖిలపక్ష పాదయాత్ర
- వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అరెస్టు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మండిపడ్డారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు బుధవారం ఇండియా కూటమి భాగస్వామ్యంతో నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ అఖిలపక్ష పాదయాత్రలో ఆయన మాట్లాడారు. పోచమ్మ మైదాన్ నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన పాదయాత్రకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని అయూబ్ డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాదయాత్రలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, వామపక్ష నేతలు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజంపై దాడులు సహించం

- వర్ధన్నపేట ఎమ్మెల్యేకు జర్నలిస్టుల హెచ్చరిక
- దిష్టిబొమ్మ దహనంపై పోచమ్మ మైదాన్‌లో భారీ ఆందోళన
- ఎమ్మెల్యే క్షమాపణ చెప్పే వరకు నిరసనలు ఆపం
- వరంగల్ తూర్పు జర్నలిస్టుల పరపతి సంఘం అధ్యక్షుడు నరేందర్



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** మీడియా సంస్థ దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా వరంగల్ పోచమ్మ మైదాన్ కూడలిలో జర్నలిస్టులు మంగళవారం భారీ ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రశ్నించే నాలుగో స్తంభంపై ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యానికి దిగడం దారుణమని, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు పరపతి సంఘం అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛను హరించే ఘటనలు ఇప్పటి వరకు 4 సార్లు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని, జర్నలిజంపై జులుం నడవదని హెచ్చరించారు. వార్తలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాలను ఆశ్రయించాలని, దిష్టిబొమ్మలు దహనం చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాదని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, ఎమ్మెల్యే క్షమాపణ చెప్పే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266